క్లుప్తంగా

కనులపండువగా వీరబ్రహ్మేంద్ర స్వామి గ్రామోత్సవం



చల్లపల్లి: స్థానిక విజయవాడ రోడ్డులోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి గ్రామోత్సవం శనివారం కనులపండువగా సాగింది. స్వామివారి 47వ వార్షిక కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఉదయం స్వామికి సహస్ర నామార్చనలు నిర్వహించి అనంతరం ఊరేగించారు. మహిళలు పెద్ద సంఖ్యలో నీరాజనం పలికారు. మండల విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శామీరుపేట సాయిబాబు, నడకుదురు లీలాబ్రహ్మేంద్ర, కోశాధికారి కేశనకుర్తి శరత్‌బాబు, అడ్డాడ ప్రసాద్ బాబు, డోలా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మోటర్ల సామర్థ్యానికి తగిన కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోండి

విద్యుత్ శాఖ ఉయ్యూరు ఈఈ కృష్ణనాయక్

చల్లపల్లి: విద్యుత్ వినియోగదారులు తమ మోటర్ల సామర్థ్యానికి తగిన కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవాలని విద్యుత్ శాఖ ఉయ్యూరు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డి.కృష్ణనాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎ.పి.ఈ.ఆర్.సి ఆదేశాల మేరకు చల్లపల్లి, ఉయ్యూరు, అవనిగడ్డ, సబ్ డివిజన్ల పరిధిలోని కేటరిగి 2, 3, 4 సర్వీసులకు నూతన విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు తమ మోటరు లోడుకు అనుగుణంగా కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవాలని, లేకపోతే కె.వి.ఎ. హెచ్ బిల్లింగ్ ఎక్కువ వస్తుందని వివరించారు.

ఆర్‌సీఎం చర్చి వార్షికోత్సవం



బందలాయిచెరువు(అవనిగడ్డ): బందలాయి చెరువు ఆర్‌సీఎం చర్చి వార్షికోత్సవ కార్యక్రమాన్ని శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. కోటగిరిలంక ఆర్‌సీఎం చర్చి విచారణ గురువు సురేష్ మెర్లో, పెదపాలెం ఆర్‌సీఎం చర్చి విచారణ గురువు ఫాదర్ బాలశౌరి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రతి ఒక్కరూ ఏసు క్రీస్తు చూపిన మార్గంలో పయనించడంతో వారి జీవితాలు శాంతిమయంగా నడుస్తాయని వారు చెప్పారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు గొరుముచ్చు కోటేశ్వరరావు, పరిశుద్ధరావు, దాస్, ఆరిగ సుబ్బారావు, ఉపదేశిలు, సిస్టర్స్, సంఘస్తులు పాల్గొన్నారు.

వధూవరులకు ఆశీస్సులు



అవనిగడ్డ: స్థానిక ఏఎస్ఆర్ కల్యాణ మండపంలో శనివారం జరిగిన పడమటి వారి వివాహ వేడుకల్లో అవనిగడ్డ మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు పాల్గొన్నారు. బందలాయిచెరువుకు చెందిన సచివాలయ ఉద్యోగి పడమటి మహేష్‌కు మచిలీపట్నానికి చెందిన సుష్మశ్రీకి వివాహం జరిగింది. సింహాద్రి నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్‌నజీర్‌బాషా, వైఎస్సార్ సీపీ నేత గాజుల జయగోపాల్ పాల్గొన్నారు.

డ్రోన్‌లతో సారా తయారీ కేంద్రాల గుర్తింపు



కృత్తివెన్ను: అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తూ నేరాలతో పాటు, అసాంఘిక కార్యకలాపాలను అరికడుతున్నట్లు ఎస్ఐ పైడిబాబు తెలిపారు. ఎస్పీ ఆదేశాలతో కృత్తివెన్ను తీరప్రాంతం నిడమర్రులోని మడఅడవుల్లో డ్రోన్ సాయంతో నాటుసారా తయారీ కేంద్రాలను గుర్తించామన్నారు. శనివారం జరిగిన దాడుల్లో 500 లీటర్ల బెల్లం ఊటను గుర్తించి స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. తయారీదారులను గుర్తించి కేసులు నమోదు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

42 వీధి కుక్కల తరలింపు

పెడన: పట్టణంలో సంచరిస్తున్న వీధి 42 వీధి కుక్కలను పట్టుకుని విజయవాడ తరలించినట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.గోపాలరావు శనివారం తెలిపారు. విజయవాడకు చెందిన నవోదయ వెట్ సొసైటీ వారు యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ-ఏఆర్‌వీ) సెంటర్‌కు ఆపరేషన్ చేయించే నిమిత్తం 42 వీధి కుక్కలను తరలించారన్నారు. పారిశుద్ధ్య సిబ్బంది వారికి పూర్తి సహకారాన్ని అందించారని, వాటికి చికిత్స పూర్తవ్వగానే తిరిగి పట్టణంలో వదులుతారని పేర్కొన్నారు.

గ్రీన్ సిగ్నల్ ఎప్పుడో!

- బందరులో అలంకారప్రాయంగా..
- కోట్లు ఖర్చు చేసినా అక్కరకు రాని వ్యవస్థ
- ప్రజలు అవస్థలు పడుతున్నా స్పందన లేదు



బందరులో అడ్డదిడ్డంగా వెళ్తున్న వాహనచోదకులు



మచిలీపట్నం లక్ష్మీటాకీస్ సెంటర్‌లో నిరుపయోగంగా ట్రాఫిక్ సిగ్నల్స్

మచిలీపట్నంటౌన్: నగరంలో ట్రాఫిక్ సిగ్నల్స్ అలంకారప్రాయంగా మారాయి. పలుచోట్ల ఏర్పాటుచేసిన సిగ్నల్స్‌ను అందుబాటులోకి తేవడానికి అధికారులు తాత్సారం చేస్తున్నారు. జిల్లాల పునర్విభజన తర్వాత జిల్లా కేంద్రం మచిలీపట్నంలో వివిధ రకాల పనులపై ప్రభుత్వ కార్యాలయాలు, దుకాణాలకు ప్రజల రాకపోకలు పెరిగాయి. దీంతో నగరంలో ట్రాఫిక్ సమస్య జటిలమైంది. ఉదయం, సాయంత్రం కార్యాయాలు, పాఠశాలల వేళల్లో అన్ని రహదారులు కిటకిటలాడుతున్నాయి. బస్సులు, ద్విచక్రవాహనాలు, ఆటోలు, విద్యార్థులు సైకిళ్లపై ఇలా గమ్యస్థానాలకు చేరడానికి రోడ్లపైకి వస్తున్నారు. అప్పుడు ప్రధాన కూడళ్ల వద్ద రద్దీ ఏర్పడుతోంది.

ఎలాంటి చర్యలు లేవు

నగరంలోని ట్రాఫిక్ నియంతణకు మూడు ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్స్ ఇప్పటికీ అలంకారప్రాయంగానే ఉన్నాయి. వీటిని వినియోగంలోకి తేవడానికి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడానికి పాలకులు, పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. 20 ఏళ్ల క్రితం నగరంలోని రేవతి సెంటరులో సిగ్నల్స్ ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి వినియోగంలోకి రాక నిరుపయోగంగా మారాయి.

మూడు సెంటర్లలో ట్రయల్‌రన్ వేసినా..

గత ప్రభుత్వ హయాంలో లక్ష్మీటాకీస్ సెంటరు, కోనేరు సెంటర్, రేవతి సెంటరులో కోట్ల రూపాయల వ్యయంతో సిగ్నల్స్ వ్యవస్థను ఏర్పాటు చేసి ట్రయిల్ రన్ వేశారు. నేడు వాటిని వినియోగించడం లేదు. ఈ వ్యవస్థను వాడుకలోకి తీసుకురాకపోవడంతో వాహనచోదకులు ఇష్టారాజ్యంగా వెళ్తున్నారు.

కేసులు రాయడానికే పరిమితమా!

నగరంలో ట్రాఫిక్ నియంత్రణపై పోలీసులు దృష్టి సారించడం లేదు. ట్రాఫిక్ విభాగానికి డీఎస్పీ స్థాయి అధికారి ఉన్నా రద్దీని క్రమబద్ధీకరించడానికి ఎటువంటి చర్యలు కనపడటం లేదు. నాగపోతరావుసెంటర్, చల్లరాస్తాసెంటర్, రాజాగారి సెంటర్, రామానాయుడుపేట వంటి ప్రధాన సెంటర్లలో ట్రాఫిక్ ఎక్కువగా ఉన్నా పోలీసులు కానరావడం లేదు. కోటవారితుళ్లసెంటర్, పరాసుపేట, జవ్వారుపేట తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు ఉన్నా డ్యూటీకి వచ్చిన వెంటనే ఎఫ్ఆర్ఎస్‌లో హాజరు వేసుకుని నీడకే పరిమితమవుతున్నారని ఆరోపణలు వినవస్తున్నాయి. సాయంత్రం వేళల్లో వాహనచోదకులపై కేసులు నమోదు చేసేందుకు ఎస్సై స్థాయి అధికారులు రోడ్లపైకి వస్తున్నారు. వీఐపీలు, ఉన్నతాధికారుల పర్యటన సమయంలో మాత్రమే పోలీసులు అన్ని సెంటర్లలో విధులను సక్రమంగా నిర్వహిస్తారని ప్రజలు వాపోతున్నారు.

నిబంధనలకు నీళ్లు

ఎవరికివారు ముందు వెళ్లిపోవాలనే ఆత్రుతతో వాహనచోదకులు నిబంధనలకు నీళ్లు వదిలేస్తున్నారు. వెనుకవచ్చే వాహచోదకులకు కనీసం సిగ్నల్ ఇవ్వకుండానే ఇష్టానుసారంగా వాహనాలను నడుపుతున్నారు. దీంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కొంత మంది ఆకతాయిలు ప్రధాన రహదారిలో సైతం వాహనంపై ముగ్గురు, నలుగురు ఎక్కి నియంత్రణ లేకుండా వాహనాలు నడుపుతుండటంతో పలువురు ఇబ్బందులకు గురవుతున్నారు. వాహనచోదకులు ట్రాఫిక్ రూల్స్ పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని పలువురు సూచిస్తున్నారు.

సందడిగా జెడ్పీ పాఠశాల వార్షికోత్సవం



మోపిదేవి జెడ్పీ పాఠశాల వార్షికోత్సవంలో మాట్లాడుతున్న విశ్రాంత ఐఏఎస్ రంగనాథం

మోపిదేవి: మోపిదేవి జెడ్పీ పాఠశాల ప్లస్ 76వ వార్షికోత్సవం స్కూల్ ఆవరణలో పాఠశాల ప్రధానోపాధ్యాయకురాలు పి.జయంతి అధ్యక్షతన ఉల్లాసంగా, ఉత్సాహంగా సాగింది. శనివారం ఉదయం సర్పంచ్ నందిగం మేరీరాణి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. సాయంత్రం పూర్వ విద్యార్థి, విశ్రాంతి ఐఏఎస్ అధికారి ఎంవీఎస్ రంగనాథం మాట్లాడుతూ పాఠశాలలోని ఉపాధ్యాయులు బృందాలుగా ఏర్పడి గ్రామాల్లో నిరక్షరాస్యత తొలగించాలన్నారు. గ్రామాభివృద్ధిలో ఉపాధ్యాయులు భాగస్వాములు కావాలన్నారు. ఈ స్కూల్లో విద్యార్థులు దేశ విదేశాల్లో ఉద్యోగాలు చేస్తూ స్థిరపడ్డారని వారు కూడా పాఠశాల అభివృద్ధిలో చేయూత నిస్తారని చెప్పారు. పాఠశాల హెచ్‌ఎం జయంతి పాఠశాల ప్రగతిని చదివి వినిపించారు. గత మార్చిలో పదిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినికి జెడ్పీటీసీ మెడబలిమి మల్లికార్జునరావు అందించిన రూ. 75 వేలతో 10 గ్రాముల బంగారు గొలుసును అందజేశారు. పాఠశాల వార్షిక బహుమతులు, సాంస్కృతిక కార్యక్రమాలకు మరో రూ.లక్ష ఆయన అందించినట్లు హెచ్‌ఎం వివరించారు. వీరితో పాటు దాతలు అందించిన విరాళాలను వివరించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఎంపీపీ రావి దుర్గావాణి, పాఠశాల కోశాధికారి రావి నాగేశ్వరావు, పాఠశాల పూర్వ విద్యార్థుల కమిటీ కార్యదర్శి కావూరి కోదండరామయ్య, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు కంఠంనేని కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.

చెరువు పూడ్చివేతపై ఆగ్రహం

చర్యలు తీసుకోవాలని పెదప్రోలులో రజకవృత్తిదారుల సంఘం డిమాండ్



పెదప్రోలు చెరువు వద్ద పూడ్చివేసిన ప్రదేశం చూపుతున్న రజకసంఘం నాయకులు

పెదప్రోలు(మోపిదేవి): పెదప్రోలు గ్రామ పంచాయతీకి చెందిన చెరువును పూడ్చివేస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని రజకవృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మున్నూరు భాస్కరయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట రెడ్డియ్య డిమాండ్ చేశారు. పంచాయతీ చెరువును రజక సంఘం లీజుకు తీసుకుని చేపపిల్లలు వేసి కొన్నేళ్లుగా సాగు చేసుకుంటున్నారని తెలిపారు. చెరువు 21 ఎకరాలకు పంచాయతీకి లీజు చెల్లిస్తుండగా ప్రస్తుతం 16 ఎకరాలు మాత్రమే ఉందని వాపోయారు. మూడు రోజులుగా బుసకతో చెరువు పూడ్చుతుండగా అడ్డుకున్న రజకులను కొంతమంది బెదిరిస్తున్నారని ఆవేదన చెందారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చెరువులు, గుంతలు పూడ్చివేసిన వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు ఆదేశాలు ఇస్తుండగా, పెదప్రోలు పంచాయతీకి చెందిన చెరువును పూడ్చి వేస్తున్నప్పటికీ అధికారులు మౌనంగా ఉండటం అనుమానాలకు తావిస్తోందన్నారు. ఇప్పటికైనా పూడ్చివేసిన ప్రదేశాన్ని ఖాళీ చేయించాలని, లేనిపక్షంలో రజకవృత్తిదారుల సంఘం ఆధ్వర్యాన పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రజకవృత్తిసంఘం నియోజకవర్గ అధ్యక్షులు అవనిగడ్డ రజనీకాంత్, క్లోపల్లి లక్ష్మి, మోపిదేవి అమ్మాజి, పోతార్లంక కమల, క్లోపల్లి శకుంతల పాల్గొన్నారు. దీనిపై గ్రామ కార్యదర్శి రామకోటేశ్వరావు వివరణ కోరగా, ఈ విషయం నా దృష్టికి కూడా వచ్చిందని విచారణ చేస్తామని తెలిపారు.

ఇద్దరు సారా విక్రేతల అరెస్ట్



కోనేరుసెంటర్: బందరు మండలం తాళ్లపాలెం గ్రామంలో సారా విక్రయిస్తున్న ఇద్దరిని ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది శనివారం అరెస్ట్ చేశారు. వారి నుంచి 70 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. మండలంలో దాడులను నిర్వహించడంతో తాళ్లపాలెం గ్రామంలో సారా విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడి చేయగా గ్రామానికి చెందిన టి.రమణ, మరో వ్యక్తి సారా విక్రయిస్తూ పట్టుబడ్డారు. వారి నుంచి నాటుసారాను స్వాధీనం చేసుకుని ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది కేసు నమోదు చేశారు. దాడిలో ఎక్సైజ్ సీఐ వెంకటేశ్వరమ్మ, ఎస్సై జె.ఎలియాజర్, హెడ్ కానిస్టేబుల్ కె మధు పాల్గొన్నారు.

వివాహితపై అత్యాచారయత్నం.. కేసు నమోదు

పెడన: వివాహితపై అత్యాచారయత్నానికి పాల్పడిన వ్యక్తిపై పెడన పీఎస్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని కొంకేపూడి గ్రామానికి చెందిన తాపీ మేస్త్రీ రాజులపాటి మధుకుమార్ స్వామి తన ఇంటికి సమీపంలో నివశిస్తున్న వివాహితతో శుక్రవారం అసభ్యంగా ప్రవర్తించి అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. బాధితురాలు కేకలు వేయడంతో కుమార్‌స్వామి పారిపోయాడు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పరారిలో ఉన్న నిందితుడి కోసం వెదుకుతున్నామని ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

మండలిపురానికి ట్యాంకర్‌తో తాగునీరు

అవనిగడ్డ: స్థానిక పంచాయితీ పరిధిలోని మండలిపురానికి ట్యాంకర్ ద్వారా తాగునీటిని సరఫరా చేశారు. ఈ ప్రాంతానికి తాగునీటిని సరఫరా చేసే బోరు మరమ్మతుకు గురవడంతో నాలుగు రోజుల నుంచి తాగునీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో ఈ కాలనీకి ట్యాంకర్ ద్వారా తాగునీటిని సరఫరా చేశారు. ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ గొరుముచ్చు ఉమా, ఉప సర్పంచ్ కోడూరు సత్యనారాయణ పర్యవేక్షించారు.

మత్స్యకారుని ఆచూకీ తెలిసేంత వరకు చర్యలు

కలెక్టర్ బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): ఇటీవల మచిలీపట్నం మండలంలోని తాళ్లపాలెం గ్రామం వద్ద ఉన్న సముద్రంలో ప్రమాదవశాత్తూ మునిగిపోయాడని వచ్చిన సమాచారంతో ఆయన ఆచూకీ తెలిసేంత వరకు గాలింపు చర్యలు చేపట్టాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. తాళ్లపాలెం గ్రామానికి చెందిన చింతా ఏడుకొండలు ఈ నెల 1వ తేదీ అర్ధరాత్రి 12 గంటల సమయంలో గ్రామంలోని లైట్‌హౌస్ వైపు సముద్రంలోకి వెళ్లి మునిగిపోయాడని సమాచారం వచ్చింది. జిల్లా మత్స్యశాఖ అధికారి, మెరైన్, కోస్ట్‌గార్డ్ అధికారుల ద్వారా గాలింపు చర్యలు చేపట్టారన్నారు. విశాఖపట్నం నుంచి రెండు ఫాస్ట్ పెట్రోలింగ్ వెసల్స్ ను ఆచూకీ తెలుసుకునేందుకు ఆదేశించారన్నారు. ఆయన ఆచూకీ తెలిసేంతవరకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఘనంగా భావనారుషి, భద్రావతిదేవి విగ్రహ ప్రతిష్ఠ

గూడూరు: గూడూరు మండలం మల్లవోలులో నిర్మించిన భావనారుషి భద్రావతి దేవీ ఆలయంలో దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠ శనివారం ఘనంగా జరిగింది. శిరందాసు సత్యనారాయణ, ఆదిశేషమ్మల ఆధ్వర్యంలో పద్మశాలీల కులదైవమైన భావనారుషి-భద్రావతీదేవి ఆలయ నిర్మాణం చేపట్టారు. దేవతా మూర్తుల విగ్రహ ప్రతిష్ఠతో పాటుగా లక్ష్మీ గణపతి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి విగ్రహాలను కూడా ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా వేద పండితులు అయిలూరి జై కిషోర్ ఆధ్వర్యంలో యాగశాలను ఏర్పాటు చేసి వేదమంత్రాల నడుమ దేవతామూర్తుల విగ్రహప్రతిష్ఠ కనుల పండువగా చేశారు అనంతరం స్వామివార్ల కల్యాణం జరిపించారు. ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన జరిగింది.

12న జలధీశ్వరాలయంలో అగస్త్య మహర్షి దంపతుల విగ్రహ ప్రతిష్ఠ

ఘంటసాల: ఏకపీఠంపై కొలువై ఉన్న శివ పార్వతులతో ప్రముఖ పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్న ఘంటసాల గ్రామంలోని బాలపార్వతీ సమేత శ్రీ జలధీశ్వరస్వామి దేవాలయంలో ఈ నెల 12వ తేదీ అగస్త్య మహర్షి - లోపాముద్ర దేవి దంపతుల విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు దేవాలయాభివృద్ధి కమిటీ సభ్యుడు గొర్రెపాటి రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం



కృత్తివెన్ను: కుమార్తె వివాహం కోసం దాచుకున్న నగదు, బంగారంతో పాటు విలువైన పత్రాలు, ఇంట్లోని ఎలక్ట్రానిక్ పనిముట్లు అన్నీ అగ్నికి ఆహుతైపోయాయని బాధితులు కన్నీటి పర్యంతమవుతున్నారు. కృత్తివెన్ను మండలం చినగొల్లపాలెం గొడపాలెంలో శనివారం మధ్యాహ్నం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ జరగడంతో పూరిల్లు అగ్నికి ఆహుతైంది. గ్రామానికి చెందిన చిల్లిముంత రామకృష్ణ నివాసంలో జరిగిన ఘటనలో దాదాపు రూ. 8 లక్షల విలువైన బంగారం, నగదు, విలువైన వస్తువులతో పాటు పత్రాలన్నీ కాలిబూడిదయ్యాయి. షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు వ్యాపించడంతో స్థానికులు అప్రమత్తమై మంటలను ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. ఫైర్ సిబ్బంది వచ్చినా అప్పటికే మొత్తం కాలిపోయినట్లు స్థానికులు తెలిపారు. దీనిపై రెవెన్యూ, ఫైర్ అధికారులు వివరాలు తీసుకున్నట్లు సర్పంచ్ సునీల్ వివరించారు.

రఘుపతి వెంకటరత్నం నాయుడుకు నివాళి



బందరులో వెంకటరత్నం నాయుడు విగ్రహానికి నివాళులు అర్పించిన దృశ్యం

మచిలీపట్నంటౌన్: సంఘ సంస్కర్త రఘుపతి వెంకటరత్నం నాయుడుకు అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ (ఆప్త) వ్యవస్థాపక అధ్యక్షుడు సమ్మెట ప్రసాద్ నివాళులు అర్పించారు. శనివారం మచిలీపట్నం విచ్చేసిన ఆయన జిల్లా కోర్టు రోడ్డులో ఉన్ రఘుపతి వెంకటరత్నం నాయుడు కాంస్య విగ్రహానికి తన మిత్ర బృందంతో కలసి పూలమాలలు వేశారు. అనంతరం ప్రసాద్ మాట్లాడుతూ కొంతమంది అక్రమ వలసదారులను ట్రంప్ ప్రభుత్వం పంపుతుందని భారతీయులు భయపడవలసిన అవసరం లేదన్నారు. మచిలీపట్నం వంటి పుణ్యభూమిలో వెంకటరత్నం విగ్రహం ఏర్పాటు చేసే అవకాశం ఆప్తాకు రావటం అదృష్టమన్నారు.

ఢిల్లీ ఆంధ్రా అసోసియేషన్ ఉపాధ్యక్షుడు, కాపు ఆర్గనైజేషన్ ఐకాన్ నిర్వాహకులు, రైల్వే శాఖ ఉన్నతాధికారి మెండు చక్రపాణి మాట్లాడుతూ కాపులంతా ఐక్యతగా ఉన్నారని, కాపులు కీలకం కానున్నారని తెలిపారు. ఐకాన్ మహా బలిజ యువత అభ్యున్నతికి విశేష కృషి చేస్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జస్టిస్ అంబటి లక్ష్మణ కుమారుడు డాక్టర్ పాపారావు మాట్లాడుతూ నేటి యువత దేశ ప్రగతికి కృషి చేయాలని, స్వార్థ చింతన వీడాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు సోడిశెట్టి బాలాజీరావు, లంకిశెట్టి బాలాజీ, మండల దుర్గాప్రసాద్, మాదివాడ వెంకట నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఉన్నతికి సరస్వతీ గణపతి హోమం



సరస్వతీ గణపతి హోమంలో విజయక్రాంతి నిర్వాహకులు

చల్లపల్లి: విద్యార్థుల అభివృద్ధిని కాంక్షిస్తూ చల్లపల్లిలోని విజయ క్రాంతి కళాశాల ఆవరణలో శనివారం సరస్వతీ గణపతి హోమం ఘనంగా నిర్వహించారు. ప్రధాన అర్చకుడు శ్రీనివాస శర్మ ఆధ్వర్యాన జరిగిన హోమంలో కళాశాల కరెస్పాండెంట్ దుట్టా శివరామప్రసాద్, నాగలక్ష్మి దంపతులు, అవనిగడ్డలోని ఎస్‌వీఎల్ క్రాంతి కళాశాల కరెస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు, వసుమతి దంపతులు పాల్గొన్నారు. రానున్నది పరీక్షా కాలం కావడంతో పిల్లలు పరీక్షలు బాగా రాయాలని, మంచి మార్కులు వచ్చేలా కటాక్షించాలని కోరుతూ హోమాన్ని నిర్వహించినట్లు కళాశాల కరెస్పాండెంట్ శివరామప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో చల్లపల్లి జెడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి కల్యాణి, హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఎ.పి.రాష్ట్ర అధ్యక్షుడు రాజులపాటి శివప్రసాద్, చల్లపల్లి సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, విద్యార్థినీ, విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీమన్నారాయణుడికి ప్రత్యేక అభిషేకాలు



ప్రత్యేక అభిషేకాల తర్వాత శ్రీమన్నారాయణుడు

కోడూరు: అభినవ మేల్కోటగా పేరుగాంచిన ఉల్లిపాలెం భక్తులతో పోటెత్తింది. భీష్మ ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని గ్రామంలోని గోదా, రాజ్యలక్ష్మీ సమేత శ్రీమన్నారాయణస్వామి ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ నిర్మాణకర్త త్రిదండి అష్టాక్షరీ సంపత్‌కుమార రామానుజీయర్ స్వామిజీ పర్యవేక్షణలో ఉదయం స్వామివారి ఉత్సవమూర్తులకు తిరుమంజన సేవ జరిగింది. అనంతరం ప్రత్యేక పల్లకీలో స్వామివార్లను ఆలయ మాడ వీధుల వెంట ఊరేగించారు. వివిధ ప్రాంతాలకు చెందిన 10మంది పండితులు మంత్రోచ్చరణల నడుమ 108 కలశాలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వాటిని ఆలయం చుట్టూ ఊరేగించి గర్భాలయంలోని 11 అడుగుల శ్రీమన్నారాయణుడి విగ్రహానికి అభిషేకాలు చేశారు. రాష్ట్ర గోదా విష్ణుసహస్ర నామ పరివార్ ఆధ్వర్యంలో ఆలయంలో స్వామివారి పారాయణ ఏకాహాన్ని ప్రారంభించారు. అష్టభుజ మండలంలో స్వామివారి చిత్రపటాన్ని నెలకొల్పి తులసీ దళాలతో మహిళలు పూజలు చేశారు. రాత్రి నగరోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. ఆదివారం ఉదయం 10గంటల వరకు ఏకాహం కొనసాగుతుందని అష్టాక్షరీ స్వామిజీ చెప్పారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక సత్యవ్రతం



సత్యదేవుని చిత్రపటాల వద్ద పూజలు చేస్తున్న ఉభయదాతలు

కోడూరు: గ్రామంలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో విశ్వశాంతి యాగ మహోత్సవ కమిటీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సత్యదేవుని వ్రతాలకు భక్తులు పోటెత్తారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 800మంది దంపతులు వ్రతాల్లో పాల్గొని భక్తిభావం చాటుకున్నారు. తిరుమల తిరుపతికి చెందిన వేదపండితులు, అర్చకులు వ్రతక్రతువును కనులపండువగా నిర్వహించారు. ఆలయ ధర్మాధికారి, టీటీడీ వేదపాఠశాల ప్రిన్సిపాల్ కుప్పా సుబ్రహ్మణ్య అవధాని, భారతీతీర్థ ధర్మానుష్ఠాన పరిషత్ అధ్యక్షుడు కుప్పా రామగోపాల సోమయాజీలు వ్రతాల విశిష్టతతో పాటు ఐదు కథలను వివరించారు. కమిటీ అధ్యక్షుడు మోపిదేవి చక్రవర్తి వీరిని శాలువాలు కప్పి సత్కరించారు.

ఆకట్టుకున్న కోలాట భజనలు

ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో భక్తబృందాల సభ్యులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కోడూరు, యర్రారెడ్డివారిపాలెం, మెరకగొడపాలెంకు మహిళలు మురళీకోలాటం నిర్వహించారు. సుమారు తొమ్మిది వేల మందికి అన్న సమారాధన చేశారు. దివిసీమలోని ఆరు మండలాల ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

బంటుమిల్లిలో

బంటుమిల్లి: స్థానిక సీతారామచంద్రస్వామి ఆలయంలో శనివారం భీష్మ ఏకాదశి సందర్భంగా సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు భక్తి, శ్రద్ధలతో నిర్వహించారు. పండితులు బృందావనం వేణుగోపాలచార్యులు వేద మంత్రాల మధ్య వ్రతాలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా స్వామివారి ప్రధానమూర్తులకు విశేష అలంకారాలతో పూజలు ఘనంగా చేశారు. అలాగే స్థానిక శ్రీ పద్మావతి, గోదా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉదయం పూజల తర్వాత భక్తులు శ్రీ విష్ణునామ పారాయణం చేశారు. కార్యక్రమల్లో ఆలయ కమిటీ సభ్యులు, పలువురు దంపతులు పాల్గొన్నారు.

మెకానిక్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు

కోనేరుసెంటర్: మచిలీపట్నానికి చెందిన ఓ మోటార్ వెహికల్ మెకానిక్‌పై చిలకలపూడి పీఎస్‌లో శనివారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మచిలీపట్నంకు చెందిన కంభంపాటి జ్యోత్స్నరాణి, జేమ్స్ భార్యభర్తలు. వారు గాంధీ నగర్‌లోని హైనీ హై స్కూలులో స్వీపర్లు. ఆ పనితో పాటు పాఠశాల విద్యార్థులకు తినుబండారాలు అమ్ముకుంటూ ఉంటారు. ఈ నెల 7వ తేదీన స్కూలుకు సమీపంలో ఓ షెడ్‌లోని వీరబాబు అనే మెకానిక్ పాఠశాలలోకి ప్రవేశించి స్కూలు కరస్పాండెంట్‌తో ఘర్షణకు దిగాడు. ఆమెతో పాటు బడ్డీలో తినుబండారాలు సర్దుకుంటున్న జ్యోత్స్నరాణిపై దుర్భాషలాడాడు. తినుబండారాలను నేలు పాలు చేసి ఆమె పొత్తి కడుపుపై తన్ని దళిత వర్గానికి చెందిన ఆమెను దూషించి అవమానించాడు. ఆ దంపతులు చిలకలపూడి పోలీసులను ఆశ్రయించి రక్షణ కోరారు. దాడి చేసి కులం పేరుతో దూషించిన వీరబాబుపై ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వీరబాబుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కింద కేసు నమోదు చేసినట్లు సీఐ ఎస్‌కే నబీ తెలిపారు. ఇదిలా ఉండగా ఎస్పీ ఆదేశాల మేరకు శనివారం ఉదయం బందరు డీఎస్పీ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుకు సంబంధించి హైనీ హైస్కూలులో విచారణ నిర్వహించారు. వీరబాబు బార్యభర్తలను కులం పేరుతో దూషించింది లేనిదీ ఘటన జరిగిన సమయంలో అక్కడ ఉన్న వారిని అడిగి తెలుసుకున్నారు. అక్కడ సిబ్బంది డీఎస్పీకి జరిగిన విషయాన్ని వివరించగా ఆయన నమోదు చేసుకున్నారు. విచారణలో చిలకలపూడి సీఐ ఎస్‌కే నబీ, ఎస్సై సుబ్రహ్మణ్యం, సిబ్బంది ఉన్నారు.